చావు బతుకుల్లో ఉన్నా చలించరు!

- ప్రత్తిపాడు సీహెచ్‌సీలో వైద్యుల అంతులేని నిర్లక్ష్యం
- విధుల్లో కనిపించని వైద్యులు
- ఎంతమంది ఎన్నిసార్లు హెచ్చరించినా భయం లేదు!
- అంతా డీసీహెచ్‌ఎస్ అండదండలతోనే?
- అత్యవసర వేళల్లోనూ నాడి పట్టేవారు కరువు



23వ తేదీన అత్యవసర చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు సీహెచ్‌సికి 108లో వచ్చిన వ్యక్తికి డాక్టర్లు లేకపోవడంతో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్స్

ప్రత్తిపాడు: ఈ నెల 23వ తేదీన పాతమల్లాయపాలెంలో పిడుగు పడటంతో ఇద్దరు వ్యక్తులు స్పృహ కోల్పోయారు. వారిని హుటాహుటిన ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించారు. డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్లు ఒక్కరూ విధుల్లో లేరు. దీంతో స్టాఫ్ నర్సులే పరీక్షలు చేసి ప్రాణంలేదని నిర్ధారించారు.

- అదే రోజున వేరొక వ్యక్తిని కూడా షుగర్ లెవల్స్ ఎక్కువై కోమా స్టేజీలో ఉన్న వ్యక్తిని అత్యవసర చికిత్స నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు. అప్పుడు కూడా వైద్యులు లేకపోవడంతో స్టాఫ్ నర్సులే పరీక్షించి ప్రాణం లేదని తేల్చేశారు. అంటే అత్యవసర వేళల్లోనూ.. చావుబతుకుల మధ్య కొట్టాడుతున్న వారి నాడి పట్టేందుకు కూడా ఇక్కడ వైద్యులు ఉండని దుస్థితి.
- ఇక్కడి వైద్యుల తీరుపై ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు, ఎంపీపీ నుంచి ఎమ్మెల్యే వరకు అనేక మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అందరూ వైద్యుల తీరు మార్చుకోవాలని ఆదేశించినా, సూచించినా వారి చెవికెక్కడం లేదు. ఫలితంగా ప్రాణాలరచేతబట్టుకుని ప్రత్తిపాడు దవాఖానాకు వచ్చే వారికి తీవ్ర నిరాశ తప్పడం లేదు. సాక్షాత్ జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి గతంలోనే ఆస్పత్రిని సందర్శించి, వీరిని ప్రత్యేకంగా హెచ్చరించినా వారి తీరులో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. కారణం ఇక్కడి వైద్యులకు డీసీహెచ్‌ఎస్ అండదండలు పుష్కలంగా ఉండటమేనన్న ప్రచారం జరుగుతుంది. ఈ ప్రచారానికి ఊతమిచ్చేలా ఉన్నాయి ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యుడు డాక్టర్ నాగార్జున చెబుతున్న మాటలు. 'మా ఆస్పత్రి డాక్టర్లుకు పదేపదే డ్యూటీ టైమ్స్‌లో కచ్చితంగా ఉండాలని చెబుతున్నా. కానీ వాళ్లు నా ఆర్డర్స్ ఫాలో అవ్వడం లేదు. యాక్షన్ తీసుకోమని డీఎస్‌హెచ్‌ఎస్‌కు నేను స్వయంగా చెప్పాను. కానీ ఏం ఉపయోగం లేకుండా ఉంది. యాక్షన్ తీసుకుంటానని చెప్పారు. కానీ చర్యలు తీసుకోవడం లేదు. ఇక నేనేం చేయగలను' వాళ్లు ఉండని దానికి నేనేం చెయ్యాలి. నాకేం సంబంధం. అంటూ ఆయన నిస్సహాయత వ్యక్తం చేయడం చూస్తుంటే మిగిలిన డాక్టర్లు డీసీహెచ్‌ఎస్‌ను ఎంత ప్రభావితం చేస్తున్నారో చెప్పకనే తెలుస్తోంది. వాస్తవానికి ఆదివారం డ్యూటీలో ఉండాల్సిన వైద్యాధికారులు అందుబాటులో ఉంటే ప్రాణాపాయం నుంచి తప్పించగలిగే పరిస్థితులు ఉండేవేమోనని కుటుంబ సభ్యులు వాపోయారు.



23వ తేదీన పిడుగుపాటుకు గురైన వారికి పరీక్షలు నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఆరుగురు వైద్యులు ఉన్నా..

ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మొత్తం ఐదుగురికిపైగా వైద్యులు ఉన్నారు. కానీ సాయంత్రం ఆరు, ఏడు గంటల తరువాత ఒక్కరు కూడా విధుల్లో ఉండని పరిస్థితి ఇక్కడ చోటు చేసుకుంటుంది. కాల్ డ్యూటీ పేరుతో విధులకు ఎగనామం పెట్టి గుంటూరుకు వెళ్లిపోతున్నారు. ఇదేమని అడిగితే కాల్ డ్యూటీ అని చెప్పడం లేదా ఫోన్‌లోనే వైద్యం చెప్పి పంపేయడం పరిపాటిగా మారింది. కానీ ఎవ్వరూ వీరి విధులు, తీరును మాత్రం మార్చలేకపోతున్నారు. వాస్తవానికి ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం ఫస్ట్ రెఫరల్ సెంటర్. అంటే నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు మండలాల్లో ఎక్కడ అత్యవసర కేసులు వచ్చినా మొదటగా రెఫర్ చేయాల్సింది ప్రత్తిపాడు సీహెచ్‌సీకే. కానీ ఇక్కడే వైద్యులు ఉండని దుర్గతి చోటు చేసుకుంటుంది. పట్టించుకోవలసిన ఆ శాఖ అధికారులు ఇక్కడి వైద్యులతో అంతర్గత ఒప్పందాలు కుదుర్చుకోవడం వలనే ఇలా వైద్యులు ఆడింది ఆట పాడింది పాటగా మారిందన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ విషయమై డీసీహెచ్‌ఎస్‌ను వివరణ కోరగా తన దృష్టికి ఎవ్వరూ ఏమీ తీసుకురాలేదని, డాక్టర్లుతో మాట్లాడుతానని చెప్పారు. ఇక హాస్పటల్ ఇన్‌చార్జి డాక్టర్ నాగార్జునను ప్రశ్నించగా వాళ్లు కచ్చితంగా డ్యూటీ టైమ్‌లో ఉండాలని చెబుతున్నాననీ, వారు ఉండటంలేదన్నారు. మధ్యలోనే వెళ్లిపోతున్నారనీ, ఎప్పుడు వెళ్లేది కనీసం తనతో కూడా చెప్పడం లేదన్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేశానని, వాళ్లే చర్యలు తీసుకోవాల్సి ఉందని వివరించారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



కాకుమాను: గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే పంచాయతీ రాజ్ ముఖ్య లక్ష్యమని ఎంపీడీఓ కె.శరత్ బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలు పల్లెటూళ్లని అలాంటి గ్రామాలలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని ఆయన తెలిపారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్రామాలలో ప్రధానమైనవి పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యా, వైద్యం అని వాటిపై ప్రతిరోజు పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని ఆమె సూచించారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉంటేనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ప్రతిరోజు మండల ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, కార్యదర్శులను పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, ఈఓపీఆర్డీ నాగానంద్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

తురకపాలెం సొసైటీ చైర్మన్‌గా భూపాల్‌రెడ్డి



గుంటూరు రూరల్: తురకపాలెం సొసైటీ చైర్మన్‌గా నల్లపాడు గ్రామానికి చెందిన దుగ్గెంపూడి భూపాల్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సోమవారం నూతన చైర్మన్ భూపాల్‌రెడ్డి మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సొసైటీ పరిధిలోని గ్రామాల రైతుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, 27వ డివిజన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దుగ్గెంపూడి యోగేశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ గుడిమెట్ల రాజా, చల్లా పార్థురెడ్డి, సాలి కిరణ్, చుక్క మోషక్ తదితరులున్నారు.

రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ



చేబ్రోలు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో చేబ్రోలులో సోమవారం ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. చేబ్రోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించి, ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు తిప్పి కొట్టకపోతే ప్రజల మనుగడకే ప్రమాదం వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను పాతర వేస్తుందని విమర్శించారు. ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించడమే ప్రధాన జెండాగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు హనుమంతరావు, చౌడయ్య, మస్తాన్ వలి, షరుపుద్దీన్, పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



గుంటూరు రూరల్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. శలపాడు గ్రామానికి చెందిన వాకా నవీన్‌కుమార్ (27) అతని స్నేహితులు ఉయ్యూరు మధు, అంజి నాగయ్య, బడుగు రాకేష్‌లు గుంటూరు నుంచి ద్విచక్రవాహనంపై చలపాడు బయల్దేరారు. ఈక్రమంలో బుడంపాడు నుంచి వస్తున్న కారు మితిమీరిన వేగంతో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఘటనలో నవీన్‌కుమార్ ఘటనా స్థలంలో మృతిచెందగా, మిగిలిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆకాశం నుంచి కిందకు పడిన చేపలు



పెదకాకాని: ఆకాశం నుంచి చేపపిల్లలు కిందకు పడి స్థానికులను ఆశ్చర్యానికి గురి చేశాయి. మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామం మైత్రి కళ్యాణ మండపం సమీపంలో ఆత్మకూరి అంజిరెడ్డి, ఆయన ఇద్దరు సోదరుల కుటుంబాలు పక్కపక్కనే ఉంటాయి. వారిలో ఇరువురి ఇల్లు (డాబా) కలిసి ఉండగా మరొకరిది వేరుగా ఉంది. గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని చల్లని గాలులు వీయడం, వర్షపు జల్లులు పడటం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. సోమవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో ఒకరి ఇంటి ఆవరణలో చేపపిల్లలు కనిపించాయి. ప్రక్కనే ఉన్న ఇంటి ముందు కూడా చేపలు కనిపించారు. సుమారు 30 వరకూ చేపలు పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న చుట్టుప్రక్కల వారు చేపలను చూసి ఆశ్చర్యపోతున్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు అనూహ్య స్పందన



మాట్లాడుతున్న పార్టీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు

చేబ్రోలు: జగనన్నే మా భవిష్యత్ మెగా పీపుల్స్ సర్వేలో కోటి మందికి పైగా కుటుంబాలు పాల్గొన్న సందర్భంగా పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సూచనల మేరకు జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు మా నమ్మకం నువ్వే కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా సృష్టిస్తున్న సునామి, మండు వేసవిలో ఫ్యాను గాలి ప్రభంజనంతో ముందుకు సాగుతున్నదన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. నియోజకవర్గంలో ఈ నెల 7వ నుంచి పీపుల్స్ మెగా సర్వే ద్వారా పొన్నూరు పట్టణంలో 14 వేలు, రూరల్ గ్రామాలలో 15 వేలు పూర్తి చేసి ముందుకు సాగుతున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో నియోజక వర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వర్లు, పొన్నూరు, చేబ్రోలు వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్‌లు అమెరినేని సాంబశివరావు, కుర్రా పాములు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణరావు, బొద్దులూరి రంగారావు, అంబటి వీర రాఘవయ్య, రుద్రపాటి ఆదిశేషులు, నాగసూరి ప్రతాప్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీల ఘటనల్లో నిందితుడు అరెస్ట్

- ఒక బైక్, 66 గ్రాముల బంగారం స్వాధీనం
- నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు




వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: ఒంటరిగా వెళుతున్న వ్యక్తులు, అర్ధరాత్రి సమయంలో ఒంటరి ప్రయాణికులను బెదిరించి చోరీలకు పాల్పడిన సంఘటనలో నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్ట్ చేశారు. అడవి తక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడుకు చెందిన చిమిటిగంట అరుణకుమారి భర్త వీరాంజనేయులు గత వారం రోజుల క్రితం మిర్చియార్డు సమీపంలో వై.జంక్షన్ మీదుగా ద్విచక్రవాహనంలో వస్తుండగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు బండిని అడ్డగించి బెదిరించి బైక్, బంగారు వస్తువులు అపహరించారని ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హాఫీజ్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టగా పోలీసుల దర్యాప్తులో తెనాలి మారీసుపేటకు చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అనే నిందితుడు మద్యం, జల్సాలకు అలవాటుపడి దారిదోపిడీలు, బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నాడనే సమాచారం మేరకు సోమవారం అతడిని వైజంక్షన్ సమీపంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడని నిందితుడి వద్దనుంచి సుమారు 66 గ్రాముల బంగారు ఆభరణాలు, పల్సర్ బైక్‌ను ఉమారు రూ.4 లక్షల విలువచేసేవి స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై లాలుపేట, పాతగుంటూరు, సత్తెనపల్లి, నగరంపాలెం, చీరాల, నరసరావుపేట, తదితర పోలీస్‌స్టేషన్లలో ఇటువంటివే పలు కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితుడు గతంలో చేసిన నేరాలకు జైలుకు వెళ్లి వచ్చాడని విడుదలై వచ్చినా తన ప్రవర్తన మార్చుకోలేదని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు కృషిచేసిన ఎస్ఐ అశోక్, పీసీలు సుబ్బారావు, షేక్ జాన్‌సైదా, పోతురాజు, కె.వెంకటనారాయణలను సౌత్‌జోన్ డీఎస్పీ వై.జెస్సీ ప్రశాంతి అభినందించారన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచటం జరిగిందని తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



పిల్లిపెసర విత్తనాలు



జనుము విత్తనాలు

ఏపీ సీడ్స్ ద్వారా రైతాంగానికి యాభై శాతం సబ్సిడీపై అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రత్తిపాడు: రైతులు అధిక దిగుబడులు సాధించడంలో కీలకమైన పచ్చిరొట్ట ఎరువులను ఖరీఫ్-2023కు సంబంధించి ఏపీ సీడ్స్ ద్వారా తక్కువ ధరకే రాయితీపై అందిస్తుంది. రానున్న ఖరీఫ్‌లో నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల్లో మొత్తం సుమారు 61 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తుంది. సుమారు 60కి పైగా రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని రైతులకు అందించనున్నారు.

యాభై శాతం రాయితీపై..

- 10 కేజీల జనుము విత్తనాల ప్యాకెట్ ధర ' 840 రూపాయలు కాగా యాభై శాతం రాయితీపై ' 420 రూపాయలకే అందిస్తుంది. అంటే కేజీ ' 84 కాగా రాయితీపై ' 42కే అందిస్తుంది.
- 8 కేజీల పిల్లిపెసర విత్తనాల ప్యాకెట్ ధర ' 776 రూపాయలు కాగా, యాభై శాతం రాయితీపై ' 388 రూపాయలకే అందిస్తుంది. అంటే కేజీ ' 97 రూపాయలు కాగా రాయితీపై ' 48.50 కే అందిస్తుంది.
- త్వరలో జీలుగలను కూడా రాయితీపై అందించనున్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

పెదనందిపాడు: విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి వారు ప్లేట్లు అందజేశారు. సోమవారం ఉదయం మండల పరిధిలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులకు ఉప్పలపాడు సత్యసాయి సేవాసమితి సభ్యులు మధ్యాహ్న భోజనం చేయడానికి విద్యార్థులకు ప్లేట్లు అందించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సుబ్బారావు



దాసరి పద్మారావును సత్కరిస్తున్న ఎంపీపీ హెప్సిభా ఇంచార్జి ఎంపీడీవో సాయిలీల

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికీ పనిదినాలను కల్పించి ఆయా కుటుంబాల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నపలకలూరు గ్రామంలో ఉపాధిదిహామీ పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామంలోని ప్రజలకు ప్రతి ఒక్కరికీ పనిదినాలను కల్పించి వారి అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాయల్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంధ్రయ్య, తోట నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు, బి.చిన్న పోతురాజు, నరేష్ ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కాగా మండలంలోని చిన్నపలకలూరు గ్రామంలో జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు, వలంటీర్లు తదితరులున్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

గుంటూరు రూరల్: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ పాత్ర అభినందనీయమని రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. సోమవారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. వేసవి కాలం కావున గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో శోభరాణి, ఎమ్ఈవో ఖుద్దూస్ గ్రామాల కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పలు పంచాయతీలకు అవార్డులు

పెదనందిపాడు: పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా 2023 సంవత్సరానికి గాను పలు గ్రామ పంచాయతీలకు వివిధ విభాగాలలో అవార్డులు వచ్చినట్లు ఎంపీపీ టి.హెప్సిభా అన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల అవార్డుల వివరాలను తెలియజేశారు. 1,పేదరికం లేని, మెరుగైన జీవనోపాధుల గ్రామ పంచాయతీలుగా అన్నపర్రు, పెదనందిపాడు, వరగాని. 2, ఆరోగ్యకరమైన పంచాయతీలుగా వరగాని, పుసులూరు, పమిడివారిపాలెం. 3, పిల్లల స్నేహపూర్వక పంచాయతీలుగా వరగాని, పెదనందిపాడు, రావిపాడు. 4, నీటి సమృద్ధి కలిగిన పంచాయతీలుగా రావిపాడు, గొరిజవోలు గుంటపాలెం, పెదనందిపాడు. 5, పరిశుభ్రమైన హరిత పంచాయతీలుగా పెదనందిపాడు, వరగాని, అబ్బినేనిగుంటపాలెం. 6, స్వయం సమృద్ధితో మౌళిక మౌళిక సదుపాయాలు కలిగిన పంచాయతీలుగా అన్నపర్రు, వరగాని, పెదనందిపాడు. 7, సామాజిక భద్రత కలిగిన పంచాయతీలుగా పెదనందిపాడు, వరగాని, రావిపాడు. 8, సుపరిపాలన కలిగిన పంచాయతీలుగా వరగాని, పెదనందిపాడు, నాగభైరువారిపాలెం. 9, మహిళా స్నేహపూర్వక పంచాయతీలుగా పెదనందిపాడు, అన్నపర్రు, వరగాని పంచాయతీలు ఎన్నికయినట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ షేక్ ఖాశింబి, ఇంచార్జి ఎంపీడీవో కె.సాయిలీల, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా కొల్లేరు



చేబ్రోలు: పొన్నూరు -నిడుబ్రోలు యాదవ సంఘం అధ్యక్షుడుగా వైఎస్సార్‌సీపీ నాయకుడు కొల్లేరు శ్రీనివాసరావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిడుబ్రోలులోని యాదవ సంఘం కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా కొల్లేరు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా పెరుగు నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా ఎం శేషుబాబు, కార్యదర్శిగా గోరంట్ల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా నక్క వంశీకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాదవ సంఘం అభివృద్ధికి, సంక్షేమానికి చేపట్టాల్సిన కార్యాచరణను సమావేశంలో చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా కొల్లేరు శ్రీనివాసరావు మాట్లాడుతూ యాదవ సంఘం సభ్యుల సహకారంతో రానున్న కాలంలో యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంఘం సభ్యులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ప్రొటోకాల్ పాటించటంలేదు

- కనీస సమాచారం ఇవ్వటంలేదు
- రూరల్ మండలం వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి



గుంటూరు రూరల్: అధికార పార్టీలో ఎంపీటీసీగా, గుంటూరు రూరల్ మండలం వైస్ ఎంపీపీగా ఉన్న తనకు మండల ఇంచార్జ్ ఎంపీడీవో ఎటువంటి సమాచారం ఇవ్వటంలేదని మండల వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి ఆరోపించారు. సోమవారం నల్లపాడు గ్రామంలోని ఆమె నివాసంలో మాట్లాడుతూ రూరల్ మండలం ఇంచార్జ్ ఎంపీడీవో శోభరాణి ప్రొటోకాల్ పాటించటంలేదని ఆరోపించారు. ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ ప్రజా ప్రతినిధులకు ఇవ్వాల్సిన కనీస ప్రాధాన్యత ఇవ్వటంలేదని వాపోయారు. మండల స్థాయిల్లో జరిగే కార్యక్రమాలకు సైతం కనీసం సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలను ఎంపీడీవో నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు సైతం ప్రొటోకాల్ పాటించటంలేదని ప్రజా ప్రతినిధులు సైతం వాపోతున్నారని ఆరోపించారు. అధికార పార్టీలో ఉన్న తనకే కనీసం గౌరవం ఇవ్వని ఎంపీడీవో మండలంలని ప్రజలకు ఏవిధంగా తగిన న్యాయం చేస్తారని ప్రశ్నించారు. సమాచారం, ప్రొటోకాల్ విషయంలో ఎంపీడీవోను అడిగితే కనీసం స్పందించటంలేదని ఆరోపించారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఎంపీడీవోపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం, ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వట్టిచెరుకూరు పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్‌గా నవరత్నకుమారి

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. స్థానిక సొసైటీలో సోమవారం పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్‌గా సోమేపల్లి నవరత్నకుమారి, డైరెక్టర్లుగా పి.సువార్తమ్మ, పి.అప్పారావులు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్, గ్రామస్తులు నాదెండ్ల అప్పారావు, సోమేపల్లి శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ ఎస్ రామచంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు వినికిడి యంత్రాలు పంపిణీ



వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో జేఎస్ రావు

చేబ్రోలు: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వినికిడి యంత్రాలను మండల విద్యాశాఖాధికారి జేఎస్ రావు సోమవారం పంపిణీ చేశారు. స్థానిక కొత్తపేట 'భవిత' కార్యాలయం వద్ద సమగ్ర శిక్షాభియాన్ వారి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికీ పదివేలు విలువ చేసే యంత్రాలను ఉచితంగా అందజేయటం జరిగింది. పుట్టుకతో పూర్తిగా మాట రాని, మూగ, వినికిడి లోపము కలిగిన ముగ్గురు విద్యార్థులకు వినికిడి యంత్రాలను అందజేశారు. హెచ్ఎం ఎం వినోద్ కుమార్, భవిత కేంద్రం లోని ప్రత్యేక ఉపాధ్యాయులు జి.అనురాధ, జి.రాజేష్, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com